క్లుప్తంగా

రెడ్డి సామాజిక వర్గంపై కూటమి సర్కారు కక్ష సాధింపు

నంద్యాల(అర్బన్): రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని రెడ్డి కమ్యూనిటీ సొసైటీ నంద్యాల అసెంబ్లీ అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎలాంటి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కూటమి నాయకులు ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు, రెడ్డి సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతియడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ విచక్షణ కోల్పోయి మహిళా అని కూడా చూడకుండా మాజీ మంత్రి రోజాపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దీనిని అందరూ ఖండించాలన్నారు.

అపోస్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (అపోస్) పుస్తకాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీఖాదరబాద్ నర్సింగరావు మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్ఎం సయ్యద్ అసదుల్లా హుస్సేన్ మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఇంటర్ తమ పాఠశాలలో చదివి పరీక్ష రాసేందుకు అనుమతి లభించినట్లు తెలిపారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దస్తగిరి, ప్రభాకర్ రెడ్డి, గురురాజ, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడిగా ఆనంద్ గురూజీ



మాట్లాడుతున్న భారత్ వికాస్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడిగా ప్రముఖ యోగ గురువు ఖండే ఆనంద్ గురూజీ, ఉపాధ్యక్షుడిగా వంకదార గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక పీఎంఆర్ కళాశాలలో భారత్ వికాస్ పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ పట్టణంలో 20 సంవత్సరాల నుంచి ఉచితంగా యోగా, ధ్యానం తదితర కార్యక్రమాలతో పాటు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పరిషత్ సభ్యులు బాలచంద్రుడు మోహన్ రావు, రామచంద్రారెడ్డి బాలకృష్ణ శ్రీనివాసులు హరిబాబు వెంకటేశ్వర్లు డాక్టర్ మహేశ్వర్ రెడ్డి అపర్ణ తిమ్మయ్య రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్స్ ఎన్నికలు



ఓటు వేస్తున్న మహిళలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల అధ్యక్ష ఖండం (డయాసిస్) పరిధిలోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1, 2 మందిరాల ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఆయా పాస్టరేట్‌ల డీనరీ చైర్మన్లు కొత్తమాసి జోసెఫ్, ఇమ్మానియేల్ గురువులు అధ్యక్షతన రైడర్ మెమోరియల్ హాల్, ఎస్పీజీ జూనియర్ కళాశాలలో ఎన్నికలు నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. నేటి సాయంత్రంలోగా పాస్టరేట్-1 ఫలితాలు, మంగళవారానికి పాస్టరేట్-2 ఫలితాలు వెలువడుతాయని పాస్టరేట్‌ల డీనరీ చైర్మన్లు తెలిపారు. కాగా ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా త్రీటౌన్ సీఐ కంబగిరిరాముడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని సంకల్ప్ పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ కోసం వెంటనే కమిషన్ నియమించాలన్నారు. 35 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ వైష్ణవ కరుణానిధి మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు ఎంటీఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన ఉపాధ్యాయ డిమాండ్లు పరిష్కరించేంత వరకు పోరాడుతామన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ సంఘం నాయకులు సయ్యద్‌చాంద్‌బాషా, భాస్కరరెడ్డి, భార్గవరామయ్య, కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విజయరావు, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం



రుద్రవరంలో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

- అధికారం కోసమే ఎన్నికల్లో హామీలు
- ఏడాది గడిచినా వాటి అమలు ఊసేలేదు
- కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

రుద్రవరం: ప్రజలను నమ్మించి మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహణపై ఆదివారం మండల కేంద్రం రుద్రవరంలోని అమ్మవారిశాల కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. వీరిని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు సూపర్‌సిక్స్ పేరుతో అనేక హామీలు ఇచ్చారన్నారు. వాటిని అమలు చేయకపోగా చేసేశామంటూ ప్రచారం చేసుకోవడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల హామీలను ఏడాదిలోపే అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. మాట ఇస్తే తమ అధినేత తప్పరని, కూటమి నాయకులు అందుకు విరుద్ధమని, మభ్యపెట్టడం వారి అలవాటు అని విమర్శించారు. ఆడబిడ్డ నిధి పేరుతో ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. అలాగే నిరుద్యోగులకు భృతి ఇస్తానని ప్రకటించి మోసం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకు పింఛన్ అని నమ్మించి ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇవ్వకపోగా ఉన్నవి తొలగిస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు కాక కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా పేదల అవస్థలు వర్ణనాతీతమని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారికి వివిధ రూపాల్లో లబ్ధి చేకూరేదని గుర్తు చేశారు.

రైతులకు భరోసా కరువు

రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. పండించిన పంటలకు మద్దతు ధర సైతం ఇవ్వ లేదన్నారు. దీంతో రైతులు తమ పంటలను దళారులు అడిగిన ధరకు విక్రయించుకొని నష్టపోవాల్సి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేదన్నారు. గతేడాది పైసా ఇవ్వలేదని, ఈసారి కూడా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండునెలలవుతున్నా అతీగతీ లేదన్నారు. ఎన్నికల ముందు మాత్రం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు సాయం అందజేస్తామని నమ్మించారన్నారు. చంద్రబాబు మాట ఇస్తారు..అమలు చేయరని ఇందుకు ఆయన గత పాలనే నిదర్శనమని విమర్శించారు. బాబు చేసిన ప్రతి మోసాన్ని ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కర పత్రంలోని క్యూఆర్ కోడ్‌ను సెల్ ఫోన్ల ద్వారా స్కాన్ చేస్తే ఆయన ఇచ్చిన హామీలు.. చేసిన మోసాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్ గందం రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాదరెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రం నర్సిరెడ్డి, పుల్లారెడ్డి,సుదర్శన్ రెడ్డి, ఎంపీపీ బాలస్వామి పాల్గొన్నారు.



బలవంతపు భూసేకరణ ఆపాలంటూ నినదిస్తున్న నాయకులు

బలవంతపు భూ సేకరణ సరికాదు

- కూటమి ప్రభుత్వ తీరుపై రైతు సంఘం నాయకులు ఆగ్రహం

నంద్యాల(న్యూటౌన్): పరిశ్రమల పేరుతో పేదల భూములు, పంటలు పండే భూములను బలవంతంగా సేకరించి కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేయడం సరికాదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరుతూ ఆదివారం నంద్యాల పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టులు, ఎస్ఈ జెడ్‌ల పేరుతో పేదల భూములను బలవంతంగా లాక్కునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ విధానానికి స్వస్తి పలకకపోతే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ గ్రామ సభల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేస్తామన్నారు. ఎన్నికల ముందు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని చెప్పి ఇంత వరకు ఎందుకు అమలు చేయ లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక వైపు పంటలకు గిట్టుబాటు ధర లేక..మరోవైపు ఎరువులు అందుబాటులో లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. దీనిపై రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని పేరుతో లక్షల ఎకరాల భూమిని సేకరించి భూ వ్యాపారం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉప కలెక్టర్లు గోవిందరాజులు, వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు జొన్న శివశంకర్, అజయ్, రామకృష్ణ, దస్తగిరిరెడ్డి, రామచంద్రుడు, సురేష్, వివిధ జిల్లాల రైతులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టి వేధిస్తే సహించం

నంద్యాల: తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తే సహించమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం నంద్యాల పట్టణంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధర్మపాలన సాగుతుందని, ఇది ఎంతో కాలం ఉండదన్నారు. తప్పుడు కేసులకు ప్రతిపక్ష నాయకులు భయపడతారని చంద్రబాబు భ్రమ పడుతున్నారన్నారు. చంద్రబాబు ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా అప్పుల మీద అప్పులు తెస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని విమర్శించిన కూటమి పార్టీలు ఇప్పుడు విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నాయి తప్ప సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదు.. రైతు భరోసా లేదు..కనీసం ఎరువులు కూడా దొరకడం లేదన్నారు. చంద్రబాబు సర్కారు సూపర్‌సిక్స్ పథకాలు గాలికి వదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడటమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించి అవినీతికి అవకాశం లేకుండా చేసిందన్నారు. జగనన్న పాలనలో బెల్ట్‌షాపులు ఎక్కడా కనిపించలేదని, ఈ రోజు టీడీపీ ప్రభుత్వంలో ఏ గ్రామంలో చూసినా బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయన్నారు.

బలిజల బలోపేతానికి సమష్టి కృషి



బలిజ సంఘం నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

ఉయ్యాలవాడ : బలిజల బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని బలిజ సంఘం మండల నూతన అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రం ఉయ్యాలవాడలో ఆ సంఘం తాలూకా గౌరవ అధ్యక్షుడు అర్జిగారి నరసింహులు ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కమతం చిన్న రాములు, అధ్యక్షుడిగా ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నగరి శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా హేమంత్ కుమార్, కోశాధికారిగా కమతం విష్ణుకుమార్, సలహాదారుడిగా బంత్రోటు శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా నడిపి వృశేనయ్య, రమణయ్య, క్రిష్ణమూర్తి, రామచంద్రుడు, బత్తుడు ఎన్నికయ్యారు. అనంతరం వీరు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంఘంలో వెనుకబడిన వారి పిల్లల చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే ఉయ్యాలవాడలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణం మండపం నిర్మాణానికి రూ. 1,01,016 అందజేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సాగునీటి సంఘం చైర్మన్ ఆకుల చిన్న వెంకట సుబ్బయ్య, మాజీ గౌరవాధ్యక్షులు జింకా వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ న్యామతుల్లా

చాగలమర్రి: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని చాగలమర్రి ఎంఈఓ న్యామతుల్లా అన్నారు. ఆదివారం చాగలమర్రిలోని శ్రీచైతన్య భారతీ ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం మహమ్మద్‌రఫి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రోత్సాహక సమావేశానికి ఎంఈఓ న్యామతుల్లా, అపుస్మా ఆళ్లగడ్డ తాలూకా అధ్యక్షుడు అమీర్ బాషా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. 2024-25 సంవత్సరంలో పదవ తరగతిలో 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన అంబికాశ్రీకి రూ.2,500, 579 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన తనీష్ తేజకు రూ.1000, 574 మార్కులు సాధించిన హాసినికి రూ.1000 నగదు బహుమతులను దాతలు రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ పి వెంకటసుబ్బయ్య, ఏఓ చంద్రకళ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అపుస్మా తాలుకా కార్యదర్శి జబ్బార్, కరస్పాండెంట్ మల్లికార్జున, ప్రిన్సిపాల్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరో ప్రజా ఉద్యమం



మాట్లాడుతున్న ఆర్ఎస్పీ నాయకుడు సుబ్బరాయుడు

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుల కోసం స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపితే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. స్థానిక నిశాంత్ భవన్‌లో ఆదివారం రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి. ఇందులో సుబ్బరాయుడు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీలు, ఇంధనపు సర్దుబాటులంటూ పేదల నెత్తిన సర్కారు మోయలేని భారం వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, శ్రీనివాసులు, అయ్యన్న, తిమ్మక్క, లక్ష్మీదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అరెస్ట్ అప్రజాస్వామికం

కోవెలకుంట్ల: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిథున్‌రెడ్డికి ప్రజానాయకుడు, వివాద రహితుడిగా పేరుందన్నారు. అక్రమ మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఆయన్ను అరెస్ట్ చేయడం చంద్రబాబు కక్షపూరిత పాలనకు నిదర్శనమన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికే అక్రమ అరెస్టులకు ప్రభుత్వం తెగబడుతోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్నికేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.

ఆధ్యాత్మికం

అమ్మవారికి సారె సమర్పణ



ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న మహిళా భక్తులు

నంద్యాల(వ్యవసాయం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు ఆదివారం శ్రీ జగజ్జనని మాతకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయమే అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. మన ఊరు-మన గుడి, మన బాధ్యత సభ్యులు కల్పనా సెంటర్‌లోని రామాలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకొచ్చారు. శ్రీ దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు పెద్దమ్మ దర్శనానికి ప్రవేశం కల్పించారు.

శ్రీసత్యసాయి రథయాత్ర ప్రారంభం



రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

చాగలమర్రి: పుట్టపర్తి సాయిబాబా శత జయంతిని పురస్కరించుకొని శ్రీసత్యసాయి రథ యాత్ర ఆదివారం చాగలమర్రి నుంచి ప్రారంభమైంది. వేద పండితులు లక్ష్మీకాంత్, శ్రీవెంకట నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీసత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు రాంపుల్లయ్య మాట్లాడుతూ నవంబరు 23వ తేదీన స్వామి శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నందున రథ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

సంక్షిప్తం

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

కళ్యాణ మండపం వేలం పాట వాయిదా

నంద్యాల (వ్యవసాయం): పట్టణం శివారులోని మూలమఠము వద్ద వెలసిన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని ఏసీ కళ్యాణమండపం బహిరంగ వేలం పాటను అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ వేణునాథరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో నిర్వహించే తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు.

అమరజీవి విగ్రహం ఏర్పాటుపై హర్షం

నంద్యాల(వ్యవసాయం): ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా అమరావతిలో 58 అడుగుల విగ్రహంతో పాటు స్మృతి వనం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై నంద్యాల ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంజీవనగర్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఖండే శ్యాంసుందర్ లాల్, భవనాసి మహేష్, బింగుమల శ్యామ్, నాగరాజు, జనార్దన్, కొట్టి చంద్ర, శ్రీనివాస్ దత్తాత్రేయ, బద్రీశెట్టి రవి, మోహన్, విష్ణు, తదితర ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడలో మోస్తరు వర్షం

ఉయ్యాలవాడ: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత వర్షాలు లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందారు. గతేడాది కాలం కలిసిరాక, కూటమి ప్రభుత్వం ఆదుకోక తీవ్రంగా నష్టపోయారు. ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతమవుతుందేమోనని భయపడ్డారు. ఈ క్రమంలో శని, ఆదివారాల్లో మండలంలో మోస్తరు వర్షం కురిసింది. మరో వారం రోజుల్లో వర్షం పడకపోతే పంటలు దున్నేయాల్సి వచ్చేదని రైతులు పేర్కొన్నారు. ఉయ్యాలవాడ మండలంలో ఖరీఫ్ సీజన్లో 2,550 హెక్టార్లలో పంటలు సాగు చేయవలసి ఉండగా ఇప్పటి వరకు మొక్కజొన్న 198 హెక్టార్లు, మినుము 35, సోయాబీన్ 7, పెసర 7, పత్తి 7 హెక్టార్లలో వేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

ఆధునిక దంత వైద్యంపై అవగాహన పెంచుకోవాలి

గోస్పాడు: ఆధునిక దంత వైద్యంపై వైద్యులు అవగాహన పెంచుకోవాలని ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అజయ్ బెనర్జీ అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి తొలి సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు రామచంద్రారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, సందీప్‌కుమార్, డాక్టర్ కిశోర్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణకిశోర్, సుబ్బారెడ్డి, సునిల్ జాషువా, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): ఐసీడీఎస్ ప్రత్యేక దత్తత కేంద్రంలో ఆరు నెలలుగా అధికారిణుల పర్యవేక్షణలో ఉన్న పసికందు శ్లోక ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సభ్యులు జైలాన్, భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న చిన్నారి శ్లోకను ఆదివారం వారు పరామర్శించి మాట్లాడారు. ఆరు నెలల పాప కాళ్లు ఫ్యాక్చర్ కావడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ ఘటనపై విచారణ జరపకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పెండింగ్ కరువు భత్యాలు వెంటనే విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని 12వ వేతన సవరణ అమలుకు కమిషన్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివయ్య, రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై నుంచి ఉద్యోగులకు వేతన సవరణ జరగాల్సి ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు భాస్కరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వీరేశ్వరరెడ్డి, హరినాథ్, గౌస్, రమాబాయి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల నివాసాల కూల్చివేతను ఆపాలి



ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆళ్లగడ్డ: అస్సాంలో పేదలు, ముస్లిం మైనార్టీల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని బీజేపీ సర్కారు వెంటనే ఆపాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ మెంబర్ జాఫర్ అన్నారు. ఈ అంశంపై ఆదివారం ఆళ్లగడ్డలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అన్యాయంగా మైనార్టీల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. రాజ్యాంగ విధ్వంస చర్యలను ప్రభుత్వం వెంటనే ఆపాలన్నారు. ఎస్‌డీపీఐ ఆళ్లగడ్డ అసెంబ్లీ అధ్యక్షుడు ముక్తార్ మాట్లాడుతూ అస్సాంలో బీజేపీ మత రాజకీయాలు చేస్తుందన్నారు. 1080 ఇళ్లను రాత్రికి రాత్రే కూల్చివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అడ్డుకున్న వారిపై పోలీసులతో లాఠీచార్జీ, ఫైరింగ్ జరపడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ జేఏసీ కమిటీ కన్వీనర్ బీరువాల బాషా, అఖిలభారత జిల్లా రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ మాలమహానాడు సంఘం నాయకుడు ఓబులేసు, ఎస్‌డీపీఐ ఆళ్లగడ్డ ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

బేస్ బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా ముల్లా షబ్బీర్



జిల్లా బేస్ బాల్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

చాగలమర్రి: నంద్యాల జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చాగలమర్రిలో ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు షేక్.బాబులాల్ ఆధ్వర్యంలో నంద్యాల జిలా అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఇందులో అధ్యక్షుడిగా చక్రం ముల్లా షబ్బీర్, ఉపాధ్యక్షుడిగా పెద్దిరెడ్డి, కార్యదర్శిగా సుబ్బయ్య, కోశాధికారిగా మల్లయ్య, ఈసీ సభ్యులుగా అబుబకర్, షాహిద్, అల్తాఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని వివిధ పాఠశాలల వ్యాయామ సంచాలకులు దాదా పీర్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.

బేస్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి

బేస్‌బాల్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి కర్నూల్ జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ చైర్మన్ షేక్ బాబులాల్ అన్నారు. ఆదివారం చాగలమర్రిలోని వైఎస్సా ర్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో విజేతలైన నంద్యాల జిల్లా క్రీడాకారులను అభినందించారు. రాష్ట్ర బేస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శులు రమణయ్య, సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లా చక్రం షబ్బీర్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

25న కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25వ తేదీన కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ నాయకులు పద్మావతి, శ్రీకాంత్, నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 27-02-2023 తర్వాత జన్మించి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 94412 43601 నంబరును సంప్రదించాలన్నారు.

చదరంగంతో మేధస్సుకు పదును



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): చదరంగంతో మేధస్సుకు పదును పెట్టుకోవచ్చునని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెరవాటి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ చదరంగంతో క్రీడాకారుల్లో ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. నెరవాటి ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నెరవాటి కృష్ణ సాయి రోహిత్ మాట్లాడుతూ నంద్యాలలో చెస్ ఆటకు మంచి ఆదరణ ఉందన్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ పి.వి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చదరంగంలో విజయానికి పావులు కదిపిన విధంగానే జీవితంలో విజయం సాధించడానికి సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, కోశాధికారి అమిదేల జనార్దన్ జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా చక్రవర్తి, టోర్నమెంట్ కోఆర్డినేటర్ సుజాత పాల్గొన్నారు.

- పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. నవనంది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నాలుగో తరగతి విద్యార్థి జీవన కృష్ణ, ఎనిమిదో తరగతి విద్యార్థి జాన్‌వెస్లీ అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో నవనంది రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలకృష్ణ, సెక్రటరీ నవీన్, ట్రెజరర్ మధుసూదన్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.